క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కంచికచర్ల : మండలంలోని కీసర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ వైవీ కృష్ణారావు గురువారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని గండేపల్లి, కీసర, పెండ్యాల, వేములపల్లి, ఎస్.అమరవరం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

డేటా ఎంట్రీపై ఉచిత శిక్షణ

జగ్గయ్యపేట అర్బన్: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ కళాశాలలో మూడు నెలల పాటు డొమాస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌జీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ వై.అంకయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ నరేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, ఆపైన విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణ కోసం ఈనెల 29 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని సంస్థ జిల్లా అధికారి నరేష్‌కుమార్ తెలిపారు. కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ఏపీ ఎస్ఎస్‌డీసీ ద్వారా సర్టిఫికెట్లు అందజేస్తామని, పూర్తి వివరాలకు సెల్‌నంబరు 9014943757లో సంప్రదించాలని ఆయన సూచించారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ

వీరులపాడు: గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు వీరులపాడు సర్పంచి కన్నమాల సురేష్‌బాబు తెలిపారు. పేర్కొన్నారు. వీరులపాడులో చేపట్టిన పారిశుద్ధ్య పనులను గురువారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఖాళీ ప్రదేశాలు, నీటి నిల్వ ప్రాంతాలతోపాటు ప్రధాన వీధుల వెంబడి బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు చెప్పారు. దోమల వ్యాప్తిని నియంత్రించేందుకు దోమల మందు పిచికారీ చేయించినట్లు వివరించారు. ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, తద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు.

నోట్‌పుస్తకాలు పంపిణీ



వీరులపాడు: అన్ని దానాల్లో కెల్లా విద్యాదానం ఎంతో గొప్పదని సియోను మినిస్ట్రీస్ డైరెక్టర్ మొగులూరి సురేష్‌బాబు పేర్కొన్నారు. సియోన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మండలంలోని బోడవాడ, జమ్మవరం గ్రామాల్లోని సియోన్ ప్రార్థనా మందిరంలో గురువారం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్‌లు, పెన్సిళ్లు తదితరాలను అమెరికా నుంచి వచ్చిన అలెక్స్‌తో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఏర్పరచుకుని అందుకనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. అలెక్స్ మాట్లాడుతూ విద్యార్థులంతా కష్టపడి చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోగులూరి బ్యూలా, మోగులూరి సర్వేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలు నిలిపివేయాలని ఆందోళన



తిరువూరు: భారత న్యాయ శిక్షాస్మృతిలోని బీఎన్ఎస్ఎస్, బీఎస్ఎస్ సెక్షన్లను మార్చుచేసి కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన సెక్షన్లను వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ తిరువూరు కోర్టు ఎదుట గురువారం న్యాయవాదులు ఆందోళన చేశారు. నూతన చట్టాలను రద్దుచేసి పాతవి కొనసాగించాలని కోరుతూ జిల్లా బార్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ ఆందోళన జరిపినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఏఐపై అవగాహన

ఇబ్రహీంపట్నం:భవిష్యత్తు మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మీదే ఆధారపడి ఉంటుందని డేటా వ్యాలీ సంస్థ టెక్నికల్ హెడ్ టి. సాంబశివరావు తెలిపారు. ఇబ్రహీంపట్నం నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఒక రోజు కెరియర్ కౌన్సెలింగ్ అవగాహనలో భాగంగా సెమినార్ నిర్వహించారు. డేటా వ్యాలీ టెక్నికల్ హెడ్ సాంబశివరావు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యతను వివరిస్తూ దీనిలో ప్రావీణ్యం సంపాదిస్తే మంచి వేతనంతో జీవితంలో స్థిరపడవచ్చన్నారు. సదస్సులో మార్కెటింగ్ మేనేజర్ కె.నరసింహరాజు, కళాశాల ప్రిన్సిపాల్ అక్బర్‌ఖాన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అజయ్ పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా లింగాల కాజ్‌వే



లింగాల వద్ద మునేటిపై ఉన్న కాజ్‌వే



గతేడాది వరదల సమయంలో కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న నీరు(ఫైల్)

- వర్షాకాలంలో కాజ్‌వేపై ఉధృతంగా పారుతున్న నీరు
- నిలిచిపోతున్న ట్రాఫిక్
- ఇబ్బందుల్లో వాహనచోదకులు
- కాజ్ వే ఎత్తు పెంచాలని డిమాండ్

వత్సవాయి : చిల్లకల్లు–వైరా ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై లింగాల వద్ద మునేటిపై ఉన్న కాజ్‌వే ప్రమాదభరితంగా మారింది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలతోపాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలుపుతూ రహదారిపై ఉన్న కాజ్‌వేను గురించి దశాబ్దాలుగా సంబంధిత అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు సైతం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. సమారు 50ఏళ్ల కిందట నిర్మాణం చేసిన కాజ్ వేపైనే ఇప్పటివరకు రాకపోకలు సాగుతున్నాయి. ఇన్నాళ్లు కాజ్‌వేపై తాత్కాలిక మరమ్మతులు చేయడం తప్ప శాశ్వత పరిష్కారాన్ని చూపడం లేదు. కాజ్‌వే తక్కువ ఎత్తులో ఉండటంతో మునేటికి వరదలు వచ్చినప్పుడు రహదారిపై నీరు పారడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. గతేడాది మునేటికి వరదలు వచ్చిన కారణంగా నాలుగురోజులు రాకపోకలు నిలిచిపోయాయి. తరువాత మరమ్మతులు చేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించాల్సి పరిస్థితి ఏర్పడింది.

సరిగా లేని దిమ్మెలు..

కాజ్‌వేకు ఇరువైపులా రక్షణగా నిలిచే దిమ్మెలు కూడా అక్కడక్కడా పగిలిపోయాయి. దీంతో ప్రమాదభరితంగా మారింది. కాజ్ వేపై ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఏర్పాటు చేసిన దిమ్మెలు కొన్ని వాహనాలు ఢీకొని పడిపోయాయి. వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనాలు వెలుగుల్లో సక్రమంగా దారి తెలియడం లేదు. ఇటీవల ఖమ్మంనకు చెందిన ఒక కారు అదుపుతప్పి మునేరులో పడింది. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పడంతో వాహనంలోని వ్యక్తులు ఊపిరిపీల్చుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా నిత్యం ఈ కాజ్‌వే గుండా ప్రయాణాలు సాగిస్తున్నా ఎవరూదీని గురించి పట్టించుకోలేదు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవచూపి కాజ్‌వే ఎత్తు పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పెరటి సాగుపై మహిళలకు అవగాహన



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ కృష్ణంరాజు

గరికపాడు(జగ్గయ్యపేట):గ్రామీణ ప్రాంత మహిళలు పెరటి కూరగాయల సాగు చేపట్టి ఆర్థికంగా ఎదగాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ కృష్ణంరాజు సూచించారు. గ్రామంలోని కేవీకేలో వారం రోజులపాటు పెరటిసాగు, పండ్ల ఆధారిత ఉత్పత్తులపై నిర్వహించనున్న శిక్షణా తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరటి కూరగాయలు సాగు మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. వ్యవసాయంలో కూడా అనేక నూతన ఒరవడులు వచ్చాయని వాటిపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. అనంతరం మహిళలకు గృహవిజ్ఞాన శాస్త్రవేత్త ప్రభావతి అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు శివప్రసాద్, జశ్వంత్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేడు శాకంబరి మహోత్సవం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని నకాశిబజారులో వేంచేసియున్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రీశాకంబరీదేవి అలంకరణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానం ఇంప్రూవ్‌మెంట్ ప్రైవేటు కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఉదయం ఐదు గంటలకు అమ్మవారికి పంచామృత అభిషేకాలు, ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు దేవస్థాన శాశ్వత పూజలు, 9 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో అమ్మవారి చీరల వేలం పాట నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

ఆలయంలో వెండి వస్తువులు అపహరణ

గౌరవరం(జగ్గయ్యపేట): గ్రామంలోని జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ ఆలయంలో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఉదయం రోజూ మాదిరిగా పూజారి ఆలయానికి వచ్చేసరికి తలుపులు తీసి ఉండటాన్ని గమనించాడు. ఆలయంలో అమ్మవారి వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు చిల్లకల్లు పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు.

రెండు ట్రాక్టర్లు స్వాధీనం

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): ఇసుక కోసం డూప్లికేట్ వే బిల్లు చూపి అదనపు ఇసుక కోసం యత్నించిన ఘటన జగ్గయ్యపేట మండలంలోని అనుమంచిపల్లి ఇసుక స్టాక్ యార్డ్ వద్ద గురువారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే గ్రామంలోని ఇసుక స్టాకుయార్డు వద్దకు మధ్యాహ్నం సమయంలో జగ్గయ్యపేటకు చెందిన సైదా అనే వ్యక్తి వచ్చాడు. అప్పటికే అతని వద్దనున్న వే బిల్లు తీసుకుని అదే వే బిల్లును జిరాక్స్ తీసి అదనంగా ఇసుక కోసం స్టాకుయార్డు వద్దనున్న రెవెన్యూ అధికారులకు చూపించాడు. దీంతో అనుమానం వచ్చిన అధికారులు ఎస్ఈబీ అధికారులకు సమాచారం అందించడంతో వారు వెంటనే వే బిల్లును పరిశీలించి డూప్లికేట్ బిల్లుగా గుర్తించారు. దీంతో అతనిని అదుపులోకి తీసుకోవడంతోపాటు పది టన్నుల ఇసుకతో కూడిన రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మణికంఠ రెడ్డి తెలిపారు. ట్రాక్టర్లను చిల్లకల్లు పోలీసులకు అప్పగిస్తామని వివరించారు.

ఆక్రమణల తొలగింపు





పేట మినీబైపాస్ రోడ్‌లో నూతన రైతుబజారు వద్ద ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని మినీ బైపాస్‌రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రైతుబజారు చుట్టుపక్కల ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగించారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, టౌన్ ప్లానింగ్ అధికారులు గురువారం స్థానిక నూతన రైతుబజారు పరిసర ప్రాంతంలోని బడ్డీకొట్లు తదితర చిరువ్యాపారుల షాపులను సిబ్బందితో తొలగింపజేశారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ త్వరలో నూతన రైతుబజారును వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. రైతుబజారు పరిసరాలను ఆక్రమించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు, టౌన్ ప్లానింగ్ అధికారి గోవర్ధనరావు, టౌన్ సర్వేయర్ డి.విశ్వనాథం, శానిటరీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాని మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ప్రధాని మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నందిగామ బీజేపీ నాయకులు

నందిగామ టౌన్: రాష్ట్రాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక ముక్కోటి మహామండపం వద్ద గురువారం స్థానిక బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు ఇస్తామనడంతోపాటు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం హర్షణీయమన్నారు. రూ.2,500 కోట్లతో 56కి.మీల మేర రైల్వే ప్రాజెక్టులు చేపడుతామని ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం శుభపరిణామని తెలిపారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు తొర్లికొండ సీతారామయ్య, కేదార్‌నాథ్‌శర్మ, పులిపాటి లక్ష్మణరావు, గంటా వెంకట్రావ్, కొత్తా సాంబశివరావు, ఊటుకూరు సత్యనారాయణగుప్తా, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్యామలాంబకు ఆషాఢ సారె



తిరువూరులో శాకంబరీ అలంకారంలో శ్యామలాంబ దర్శనం



గంపలగూడెంలో ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ



అమ్మవారికి ఆషాఢ సారె సమర్పిస్తున్న భక్తులు

తిరువూరు: ఆషాఢ మాస సందర్భంగా స్థానిక బస్టాండు సెంటర్లోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్యామలాంబదేవిని వివిధ కాయగూరలతో శాకంబరీ దేవిగా గురువారం అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాధాకృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. దేవదాయ శాఖ మేనేజరు జన్ను వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

గ్రామదేవతకు భక్తిశ్రద్ధలతో సారె

గంపలగూడెం:ఆషాఢమాసం సందర్భంగా గంపలగూడెంలో ముత్యాలమ్మ అమ్మవారికి గురువారం మహిళలు భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు.

గ్రామదేవతకు ముందుగా ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం 50 మంది మహిళలు నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, పువ్వులు తదితర సారసామగ్రి అమ్మవారికి సమర్పించారు.

రెడ్డిగూడెం:మండల కేంద్రంలోని రాజగోపాలస్వామి ఆలయంలో అమ్మవారికి భక్తులు ఆషాఢ సారెను గురువారం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలు, పండ్లు, ఫలహారాలు, సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాఘవాచారి భక్తులు పాల్గొన్నారు.



గంపలగూడెంలో గ్రామదేవతకు సమర్పించే సారెతో మహిళలు

వీఎంబీకే ఎంపికపై గందరగోళం

నవాబుపేట(పెనుగంచిప్రోలు):మండలంలోని నవాబుపేటలో విలేజ్ మొబైల్ బుక్ కీపర్(వీఎంబీకే) ఎంపికపై గురువారం తీవ్ర గందరగోళ పరిస్థితి ఏర్పడింది. గ్రామానికి చెందిన వీఎంబీకేగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలైన దివ్వెల రాణిని తొలగించాలంటూ టీడీపీ నాయకులు అధికారులపై పట్టుపట్టడం వివాదస్పదమైంది. ఈ విషయంపై గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు గింజుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలోని పంచాయతీ కార్యాలయం లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఈ వీఎంబీకే ఎన్నిక నిర్వహించకుండా గ్రామంలోని బొడ్డురాయి సెంటర్‌లో అధికారులు ఎలా నిర్వహించారని ప్రశ్నించారు. మొత్తం 49 డ్వాక్రా గ్రూపులు ఉండగా 35 గ్రూపు సభ్యులు హాజరు కావాలని సూచించడం తగదన్నారు. గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులను కూడా వారి ఇష్టం వచ్చినట్లు మార్చారన్నారు. ఎంపీపీ మార్కపూడి గాంధీ మాట్లాడుతూ ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. నవాబుపేట వీఎంబీకే ఎంపిక విషయంపూ ఏపీఎం రాజారావును వివరణ కోరగా వీఎంబీకేలను మూడేళ్ల తర్వాత మార్చాలని, గ్రామంలో వీఎంబీకే ఎంపికకు సంబంధించి సభ్యుల సంతకాలు తీసుకున్నామని వివరించారు. తీర్మానం చేయలేదని తెలిపారు. వీఎంబీకే ఎంపిక విషయంలో గందరగోళ పరిస్థితిలో విషయాన్ని పీడీ దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని ఏపీఎం వివరించారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ



పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేట అర్బన్: వెల్ఫేర్ స్టాంప్ డ్యూటీకి సంబంధించి బెనిఫిట్స్ పెంచాలని కోరుతూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, న్యాయవాదులు మాట్లాడుతూ వెల్ఫేర్ స్టాంప్ డ్యూటీ రూ.60 ఉన్నప్పుడు, అడ్వకేట్ బెనిఫిట్స్ రూ.4లక్షలు ఇచ్చారని తెలిపారు. కానీ అదే వెల్ఫేర్ స్టాంప్ డ్యూటీ రూ.250కి పెంచిన తర్వాత కూడా అడ్వకేట్ బెనిఫిట్స్ రూ.4 లక్షలుగా కొనసాగించడం తగదన్నారు. కావున వెంటనే అడ్వకేట్ బెనిఫిట్స్ రూ.25 లక్షలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు ఈవీ జగన్నాధరావు, జంగా నరసరాజు, కరణం నరసింహారావు, శ్యామల నరసింహారెడ్డి, పసుపులేటి సత్యశ్రీనివాసరావు, వై.ధనుంజయుడు, జి.లక్ష్మీనారాయణ, ఎం.కృష్ణయ్య, శ్రీనివాసగౌడ్, ఎం.ఆంజనేయులు, కె.శ్రీనివాసరావు, పూల నాగరాజు, ఆర్.ప్రసాద్, డి.నాగేశ్వరరావు, బిక్షమయ్య, చిన్న గాంధీ, శ్రీనివాసవి తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు అలవాటు పడితే చిత్తే



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఈబీ సీఐ సత్యనారాయణ, పక్కన ఎస్ఐ కల్యాణి, అధ్యాపకులు


ఎస్ఈబీ సీఐ సత్యనారాయణ

కంచికచర్ల : యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉంటేనే ఉన్నతమైన జీవితాన్ని పొందుతారని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) సీఐ బి.సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని పరిటాల ముత్తవరపు వెంకటేశ్వరరావు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం 'మాదక ద్రవ్యాలను అరికడదాం' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో ఆనందమైన నిండు జీవితం బలి అవుతుందన్నారు. ప్రతిఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువతీయువకులు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, దేశరక్షణ కోసం పాటుపడాలని పేర్కొన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలా చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుపదార్థాల తీసుకుంటే జ్ఞాపకశక్తి తగ్గిపోతుందనే విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలన్నారు. మత్తుపదార్థాలు లేని సమాజ నిర్మాణం కోసం ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మత్తుపదార్థాలు, అసభ్యకరమైన సినిమాలు, ఇంటర్నెట్‌కు ఆకర్షితులై అందమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎస్ఐ ఎన్. కళ్యాణి మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా చదువుపై దృష్టి సారించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు. ఇప్పటికే డ్రగ్స్ నియంత్రణకు ఎస్ఈబీశాఖ, పోలీస్‌శాఖ అన్నిరకాల చర్యలు తీసుకుటుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యు.ఏడుకొండలు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎం.శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, సెబ్ ఎస్ఐ వై.నాగేంద్రకృష్ణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సదస్సుకు హాజరైన విద్యార్థులు



సదస్సులో మాట్లాడుతున్న సీఐ జానకిరాం, పక్కన ఎస్ఐ రాంబాబు, హెచ్‌ఎం జలజ

పెనుగంచిప్రోలు:సైబర్ నేరాల బారినపడకుండా విద్యార్థులు తగిన అవగాహన కలిగి ఉండాలని జగ్గయ్యపేట సీఐ జానకిరాం సూచించారు. స్థానిక కెవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే స్పందించ కూడదన్నారు. ముఖ్యంగా ఆండ్రాయిడ్ ఫోన్ ఉపయోగించే వారు తెలియని లింక్స్ ఓపెన్ చేయకూడదని, ఆధార్ నంబర్‌కు సంబంధించిన ఓటీపీ నంబర్లు ఎవరికీ చెప్పకూడదన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి టోల్‌ఫ్రీ నంబర్ 1930ను అందరూ తెలుసుకోవాలని సూచించారు. పెనుగంచిప్రోలు ఎస్ఐ పి.రాంబాబు, హెచ్‌ఎం కె.జలజ, ఉపాధ్యాయులు ముక్కా సత్యనారాయణ, వేగినేటి రమణ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



చాట్రాయి: తాటి చెట్టుపై నుంచి పడి చనిపోయిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని ఆరుగొలనుపేటకు చెందిన అంబోజు రమేష్ (25) నాలుగు సంవత్సరాల క్రితం తాడి చెట్టు ఎక్కి కింద పడి చనిపోయాడు. కుటుంబ పోషణ భారం కావడంతో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల అధ్యక్షురాలు లింగోజు సరిత ఆధ్వర్యంలో దాతల ద్వారా రూ.16,500 సేకరించి గురువారం మృతుడి భార్య అంబోజు ధనలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

తిరువూరురూరల్: మండలంలోని చౌటపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామస్తులు తల్లపురెడ్డి బసివిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాజశేఖరరెడ్డి ఇనుప బీరువా వితరణ ఇచ్చారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బీరువాను ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌కు అందజేశారు.